# 4. పరలోక జీవితం

ఇహలోకం తాత్కాలికమైనది. మానవుని అసలుజీవితం మరణం తరువాతే మొదలవుతుంది. అదే పరలోక జీవితం. పరలోకజీవితంలో సాఫల్యం పొందడానికి ఇహలోకంలోనే పాటుపడటం బుద్ధిమంతుని లక్షణం. మనిషి తాను చేసే ప్రతి పనికీ దేవుని ముందు జవాబు చెప్పుకోవలసి ఉంటుంది.

ఒకసారి దైవప్రవక్త (స) ఇంట్లో నుంచి బయటికొచ్చి చూస్తే అక్కడ కొందరు విరగబడి నవ్వుతూ ఉండటం కన్పించింది. దైవప్రవక్త (స) వారితో ఇలా అన్నారు: "జాగ్రత్త! మీరు గనక రుచులను కోసివేసేదాన్ని, అంటే మరణాన్ని ఎక్కువగా గుర్తుకు తెచ్చుకుంటుంటే నేను మిమ్మల్ని ఈ పరిస్థితిలో చూసేవాణ్ణి కాను. కనుక మీరు రుచులు కోసివేసేదాన్ని ఎక్కువగా జ్ఞాపకం చేసుకుంటూ ఉండండి. సమాధి ప్రతిరోజూ 'నేను అపరిచితమైన గృహాన్ని, నేను ఒంటరితనంగల గృహాన్ని, నేను మట్టిఇల్లుని, నేను పురుగుల గృహాన్ని' అని అంటుంది."

ఆ తరువాత దైవప్రవక్త (స) ఇలా తెలియజేశారు: విశ్వసించిన దాసుడ్ని సమాధిలో పూడ్చిన తరువాత అతనితో సమాధి ఇలా అంటుంది: "సుస్వాగతం! నీవు నీ ఇంటికే వచ్చేశావు. నా మీద నడిచేవారందరిలో నీవే నాకెక్కువ ప్రియమైనవాడవు. ఈరోజు నీవు నాకు అప్పగించబడి నా దగ్గరకు వచ్చావు. ఇక నీ పట్ల నేను ఎంత బాగా ప్రవర్తిస్తానో చూడు." ఆ తరువాత సమాధి కనుచూపు మేరకు విస్తరిస్తుంది. ఆ విశ్వాసి కోసం (దైవదూతలు) సమాధిలో స్వర్గం వైపుండే కిటికీ తెరచి పెడ్తారు.

అవిశ్వాసిని లేదా పాపిని సమాధిలో పూడ్చిన తర్వాత సమాధి ఇలా అంటుంది: "నీ రాక చెడ్డరాక. నువ్వు చెడ్డచోటికి వచ్చావు. నా మీద నడిచే వారందరిలో నీవే నాకు ఎక్కువ అసహ్యకరమైన వాడివి. ఈరోజు నిన్ను నాకు అప్పగించడం జరిగింది. నువ్వు నా అధీనంలోకి వచ్చావు. ఇక చూడు, నీ పట్ల నా ప్రవర్తన ఎలా ఉంటుందో."

ఇలా అన్న తర్వాత సమాధి అతడ్ని గట్టిగా అదిమేస్తుంది. దాంతో అతని పక్కటెముకలు విరిగి కుడివైపు ఎముకలు ఎడమవైపు ఎముకలలోకి చొచ్చుకొస్తాయి. దైవప్రవక్త (స) ఈమాట చెబుతూ తన ఎడమచేతి వ్రేళ్ళను కుడిచేతి వ్రేళ్ళలోకి జొప్పించి చూపుతారు. (మిష్కాత్)

దైవప్రవక్త (స) అన్నారు: "మీరు సమాధులలో పరీక్షించబడతారు. విశ్వాసిని సమాధిలో ఉంచినప్పుడు అతని కర్మలు అతని చుట్టూ చేరుతాయి. పరీక్ష దూతలు ఎటు నుండి రావడానికి ప్రయత్నించినా ఆ కర్మలు వారిని నిరోధిస్తాయి.

తరువాత ఒక దైవదూత వచ్చి, 'ఆ వ్యక్తి గురించి నీ అభిప్రాయం ఏమిటీ?' అని అడుగుతాడు. విశ్వాసి 'ఎవర్ని గురించి?' అని అంటాడు. 'ముహమ్మద్ (సల్లం)ని గురించి'



అంటాడు దైవదూత. అప్పుడు విశ్వాసి 'ఈయన నిస్సందేహంగా దేవుని ప్రవక్తని నేను సాక్ష్యమిస్తున్నాను' అంటాడు. 'అయితే ఈయన దేవుని ప్రవక్తని నీకెలా తెలుసు?' అని దైవదూత మళ్లీ ప్రశ్నిస్తాడు. విశ్వాసి 'ఈయన దైవప్రవక్తని నేను సాక్ష్యమిస్తున్నాను' అంటాడు. అప్పుడతనికి స్వర్గశుభవార్త విన్పించడం జరుగుతుంది.

కాని సత్యతిరస్కారిని సమాధిలో ఉంచినప్పుడు అతడ్ని పరీక్ష దూతల నుండి కాపాడే ఎలాంటి సత్కర్మలు అతని దగ్గర ఉండవు. దైవదూత అడిగిన ప్రశ్నలకు అతను సరైన సమాధానాలు ఇవ్వలేడు. అప్పుడు తలపై అగ్నికణం ఉండే ఒక జంతువు వచ్చి, అతడ్ని కొరడాతో కొట్టడం ప్రారంభిస్తుంది. అతను ఎంత అరిచి గీపెట్టినా దానిపై ఎలాంటి ప్రభావం ఉండదు." (అహ్మద్)

**నిష్టదరిద్రుడు :** దైవప్రవక్త (స) తన అనుచరులి "దరిద్రుడంటే ఎవరో మీకు తెలుసా?" అని అడిగారు. దానికి అనుచరులు "డబ్బు, ఇతర సంపదలు లేనివాడ్ని మేము దరిద్రుడని భావిస్తున్నాం" అని అన్నారు. తరువాత దైవప్రవక్త (స) ఇలా చెప్పారు:

"నా అనుచర సముదాయంలో ప్రళయదినాన ఒకడు నమాజ్, జకాత్, రోజాలు వగైరా సత్కార్యాలు తీసుకొని వస్తాడు. అయితే అతను ఎవరినైనా దూషించి ఉంటాడు. ఎవరిపైనయినా అపవాదు లేపి ఉంటాడు. ఎవరి ధనాన్నయినా అన్యాయంగా కాజేసి ఉంటాడు. ఎవరినైనా హత్యచేసి ఉంటాడు. ఎవరినైనా అన్యాయంగా కొట్టి ఉంటాడు. అంచేత అతను ఎవరెవరిని వేధించాడో, ఎవరెవరి హక్కులు కొల్లగొట్టాడో వారం దరికీ అతని పుణ్యకర్మలు పంచిస్తారు. అప్పటికీ వారందరి హక్కులు పూర్తిగా నెరవేరక ముందే అతని పుణ్యకర్మలు అంతమైపోతే, ఆ హక్కుదారులు చేసిన పాపాలు అతని ఖాతాలో వేసి అతడ్ని నరకంలో పడవేయడం జరుగుతుంది." (ముస్లిం)

దైవప్రవక్త (స) ఇలా తెలిపారు: "నరకంలో అందరికంటే తేలికపాటి శిక్ష అనుభవించేవాడి పరిస్థితి ఎలా ఉంటుందంటే, అతని కాళ్ళకు రెండు అగ్ని చెప్పులుంటాయి. వాటి వేడికి అతని మెదడు కుండలోని పదార్థం ఉడుకుతున్నట్లు కుతకుత ఉడికిపోతుంటుంది. ఇది అందరి కంటే తేలిక యాతన అయినప్పటికీ ఆ నరకవాసి ఇంత కంటే కఠినమైన యాతన మరెవరికీ లేదనుకుంటాడు." (బుఖారి)

**రక్తకన్నీరు :** దైవప్రవక్త (స) ఓసారి అనుచరులతో మాట్లాడుతూ ఇలా అన్నారు: "సోదరులారా! (నరకయాతనలను తలచుకొని) ఏడ్వండి. ఏడ్వడం చాతకాకపోతే కనీసం ఏడ్పు ముఖమైనా పెట్టుకోండి. నరకంలో నరకవాసి అత్యంత ఘోరంగా ఏడుస్తాడు. అతని కళ్ళ నుంచి నీటిధారలు వరదలై పారుతాయి. అలా ఏడుస్తూ నీటిధారలు ఆగిపోయి రక్తకన్నీరు పారుతుంది. (రక్తకన్నీరు కూడా వరదలై పారుతుంది.) దాంతో అతని కళ్ళు పచ్చి పుండ్లయి పోతాయి. నరకవాసి కళ్ళ నుంచి పారే ఈ నీటి, రక్తపు కాలువల్లో గనక పడవలు వదిలితే అవి నిక్షేపంగా నడుస్తాయి." (షరాసున్న)

**నరకవాసుల రూపురేఖలు :** నరకవాసులు ఎంతో నల్లగా, వికృతంగా, భయానకంగా ఉంటారు. ఖుర్ఆన్‌లోని ఈ సూక్తులు వారి రూపురేఖలకు కొంతవరకు అద్దం పడ్తాయి :-

"దుష్కార్యాలుచేసేవారికి వారి దుష్కార్యాలకు తగినట్లే దుష్ఫలం ఉంది. వారిని అవమానం, అప్రతిష్ఠలు చుట్టుముడ్తాయి. దేవుని పట్టు నుండి వారిని కాపాడే నాథుడే ఉండడు. వారి ముఖాలు (నిరాశా నిస్పృహలతో) కారు చీకటిలా నల్లగా మాడిపోయి ఉంటాయి. వారే నరకానికిపోయేవారు. నరకంలోనే ఎల్లకాలం పడిఉంటారు." (దివ్య ఖుర్ఆన్-10:27); "నరకాగ్ని వారి ముఖచర్మాన్ని మాడ్చివేస్తుంది. దాంతో వారి పళ్ళు, దవడలు బయటికి వస్తాయి." (ఖుర్ఆన్-23:104)

హదీసుల్లో కూడా నరకవాసుల వికృత రూపాలను గురించి ప్రస్తావన ఉంది. దైవప్రవక్త (సల్లం) ఈ విషయాన్ని గురించి ఇలా తెలియజేశారు :

"నరకవాసి నిప్పులో కాలడం వల్ల అతని పైపెదవి కురుచైపోయి తలలో అర్ధ భాగందాకా పోతుంది. క్రిందిపెదవి బొడ్డుదాకా జారి వ్రేలాడుతూ ఉంటుంది." (తిర్మిజి)

హజ్రత్ అబ్దుల్లా బిన్ అమ్ర్ (రజి) నరకవాసులు వికృత రూపాలను గురించి మాట్లాడుతూ ఇలా అన్నారు: "నరకవాసుల్లో ఎవరినైనా ఒకడ్ని భూలోకంలోకి పంపిస్తే ఎంతో వికృతమైన అతని భయంకర స్వరూపం, అతని శరీరం నుండి వెలువడే దుర్వాసనల కారణంగా భూలోకవాసులు తప్పకుండా చచ్చిపోతారు." హజ్రత్ అబ్దుల్లా (రజి) ఈమాట చెప్పి ఎంతగానో దుఃఖించారు. (తర్గీబ్)

**నరకంలో ఎక్కువమంది స్త్రీలే** : దైవప్రవక్త (స) ఇలా తెలియజేశారు : "నేను స్వర్గంలో చూస్తే ఎక్కువమంది పేదవాళ్ళే కన్పించారు; నరకంలో ఎక్కువమంది స్త్రీలే కన్పించారు." (మిష్కాత్)

దైవప్రవక్త (స) ఒకసారి పండుగ నమాజు కోసం ఈద్గాహ్ వెళ్తున్నారు. దారిలో కొందరు స్త్రీలు ఎదురయ్యారు. ఆయన వారితో "మహిళల్లారా! దానధర్మాలు చేస్తూ ఉండండి. నేను నరకంలో అత్యధికమంది స్త్రీలనే చూశాను" అన్నారు. స్త్రీలు ఈమాట విని "ఎందువల్ల?" అని అడిగారు. దానికి దైవప్రవక్త (స) "స్త్రీలు ఎక్కువగా శాపనార్థాలు పెడ్తుంటారు; భర్తలపట్ల కృతఘ్నులవుతారు" అని చెప్పారు. (బుఖారి, ముస్లిం)

దైవప్రవక్త(స) హితోక్తి: "ఒక ఉదయం లేక సాయంత్రం దైవమార్గంలో బయలుదేరి వెళ్ళడం యావత్తు ప్రపంచం, ప్రపంచంలోని సమస్తం కంటే ఎంతో శ్రేష్ఠమైనది. స్వర్గ స్త్రీలలో ఒక స్త్రీ గనక భూలోకంలోకి తొంగిచూస్తే భూమ్యాకాశాల మధ్య ఉన్నదంతా కాంతివంతం అవుతుంది; సువాసనతో గుబాళిస్తుంది... ఆమె తల మీది వస్త్రం యావత్తు ప్రపంచం, ప్రపంచంలోని సమస్తం కంటే ఎంతో శ్రేష్ఠమైనది." (బుఖారి)



**దైవదర్శనం :** మహాప్రవక్త ముహమ్మద్ (స) ప్రవచనం: "స్వర్గవాసులు స్వర్గంలో ప్రవేశించిన తరువాత విశ్వప్రభువు వారిని ఉద్దేశించి 'మీకు ఇంకేమైనా కావాలా? అడగండి, ఇస్తాను' అంటాడు. దానికి వారు '(మాకన్నీ ఇచ్చారు కదా! ఇంకేం కావాలి?) మీరు మాముఖాలను కాంతివంతం చేయలేదా? మమ్మల్ని నరకం నుండి తప్పించి స్వర్గప్రవేశం కూడా చేయించారుగా!' అంటారు. ఆ తరువాత దైవదర్శనం కోసం తెర ఎత్తేయబడుతుంది. అప్పుడు స్వర్గవాసులంతా (సృష్టికర్త, విశ్వప్రభువయిన) దేవుడ్ని కళ్ళారా చూసుకుంటారు. స్వర్గంలో ప్రసాదించబడిన భాగ్యాలన్నిటి కంటే వారికి దైవదర్శనమే ఎంతో ప్రియమైన భాగ్యం అన్పిస్తుంది." (ముస్లిం)

దైవప్రవక్త (స) హితోక్తి : "స్వర్గంలో ఒక బజారుంది. స్వర్గవాసులు ప్రతి శుక్రవారం అక్కడికి వెళ్తారు. అక్కడ ఉత్తరగాలి వీస్తూ స్వర్గవాసుల ముఖాలపై, దుస్తులపై సువాసన వెదజల్లుతుంది. దాంతో వారి అందం రెట్టింపు అవుతుంది. ఈవిధంగా వారు ఎంతో అందంగా మారి తమతమ ఇండ్లకు తిరిగి వెళ్ళిపోతారు. వారి భార్యలు వాళ్ళను చూసి 'దైవసాక్షి! మీరు మా నుండి వేరయిపోయిన తరువాత మీ అందం రెట్టింపు అయింది' అనంటారు. వారీ మాట విని 'దైవసాక్షి! మేము మీ దగ్గర్నుంచి వెళ్ళిపోయిన తర్వాత మీ అందం కూడా రెట్టింపు అయింది' అనంటారు." (ముస్లిం)

**చిత్తశుద్ధిలేని సత్కర్మలు వ్యర్థం :** దేవుడ్ని, ఆయన ప్రవక్తను విశ్వసించినవారు ప్రతి పనీ కేవలం దేవుని ప్రసన్నత కోసమే చేయాలి. ఇతరుల మెప్పు పొందడానికి, ప్రజల పొగడ్తలు ఆశించడానికి, కీర్తిప్రతిష్ఠల కోసం ప్రదర్శనా బుద్ధితో చేసే సత్కర్మలు ప్రళయదినాన వ్యర్థమవుతాయి. అలాంటివారు నరకశిక్షలు అనుభవించవలసి వస్తుంది.

దైవప్రవక్త (స) స్పష్టంగా ఇలా తెలియజేశారు: "తప్పకుండా వచ్చితీరే ప్రళయదినాన దేవుడు మానవులందర్నీ (హషర్ మైదానంలో) సమీకరించిన తరువాత పిలిచేవాడు (దైవదూత) మానవులందర్నీ బిగ్గరగా సంబోధిస్తూ ఇలా అంటాడు- 'ఎవరైనా ఏదైనా పని దేవునికోసం చేస్తూ ఆ పనిలో ప్రదర్శనబుద్ధితో మరొకరిని చేర్చితే అలాంటి మనిషి తన కర్మఫలాన్ని దేవుని నుండి గాక ఇతరుల నుండే పొందాలి." (మిష్కాత్)

మరొక హదీసులో ఆయనిలా అన్నారు: "దేవుడు తన దాసులకు కర్మఫలాలిచ్చే రోజు లోకులమెప్పు కోసం కర్మలు ఆచరించినవారిని ఉద్దేశించి 'ప్రపంచానికి వెళ్ళండి. మీరు ఎవరి మెప్పుకోసం కర్మలు ఆచరించారో వారి దగ్గరికే వెళ్ళండి. వెళ్ళి వారిదగ్గర మీ కర్మలకు ప్రతిఫలం లభిస్తుందో లేదో చూసుకోండి' అనంటాడు." (మిష్కాత్)

(పరలోక ప్రస్థానం పుస్తకం నుండి)